# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం


# లాడ్జిలో ప్లాన్.. కరీంనగర్‌లో దోపిడీ.. అడవుల్లో అదృశ్యం

## ప్లాన్ పక్కా... పోలీసులకు ఛాలెంజ్‌గా దోపిడీ గ్యాంగ్!

### ధర్మపురి లింక్‌తో దోపిడీ కేసు హీట్
### సీసీటీవీలో క్లియర్... కానీ గ్యాంగ్ ఎక్కడ?



**ధర్మపురి, మే 5( నినాదం):** కరీంనగర్‌లోని పీఎంజే జువెలరీ షాప్‌లో జరిగిన భారీ దోపిడీ కేసు దర్యాప్తు సంచలన మలుపులు తిరుగుతోంది. కరీంనగర్ జువెలరీ దోపిడీకి 'ధర్మపురిని బేస్'... గా మార్చుకొని దుండగులు గోదావరి దాటి అంతర్రాష్ట్ర సరిహద్దు మీదుగా పరార్ ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది .ఇటుక బట్టీల వద్ద పల్సర్ బైక్... అడవుల్లో మరో వాహనం దొరికినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది దీంతో పోలీసులు జాగిలాలతో హంట్ తీవ్రతరం చేశారు. ఇది యాదృచ్ఛిక చోరీ కాదని, పక్కా ప్లానింగ్‌తో, ముందస్తు రేకీతో అమలు చేసిన అంతర్రాష్ట్ర గ్యాంగ్ ఆపరేషన్‌గా పోలీసులు తేల్చే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ కేసులో ధర్మపురి కీలక కేంద్రంగా మారడం మరింత అనుమానాలకు దారితీస్తోంది.

**ధర్మపురిలోనే 'ఆపరేషన్ ప్లాన్'... లాడ్జిలో గుట్టుచప్పుడు కాకుండా మకాం**

దొంగలు ఈనెల 1, 2 తేదీల్లోనే ధర్మపురిలోకి ఎంట్రీ ఇచ్చి పట్టణ నడిబొడ్డున ఓ ప్రైవేట్ లాడ్జిలో బస చేసినట్లు పోలీసులు గుర్తించారు. భక్తుల రద్దీని కవర్‌గా ఉపయోగించుకుని, ఎలాంటి అనుమానం రాకుండా రోజంతా కదలికలు సాగించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇదే సమయంలో కరీంనగర్ జువెలరీ షాప్‌పై రేకీ చేసి, దాడి సమయాన్ని ఫిక్స్ చేసినట్లు అనుమానం.

**రూట్ ఫిక్స్ .. దాడి ఎగ్జిక్యూషన్ పర్ఫెక్ట్!**

మద్దునూర్--రామడుగు మార్గం గుండా కరీంనగర్ చేరుకుని మెరుపువేగంతో దోపిడీ చేసి, అదే మార్గం గుండా తిరిగి ధర్మపురికి చేరుకున్నట్లు దర్యాప్తులో తేలుతోంది. తక్కువ రద్దీ ఉన్న ఈ మార్గాన్ని ఎంచుకోవడం గ్యాంగ్ ప్లానింగ్ స్థాయిని చూపిస్తోంది.

**ఇటుక బట్టీల వద్ద బిగ్ క్లూ... పల్సర్ బైక్ 'డంప్'**

దోపిడీ అనంతరం ధర్మపురి గోదావరి తీరాన్ని ఆశ్రయించిన దుండగులు, అక్కడి ఇటుక బట్టీల సమీపంలో పల్సర్ బైక్ (టీఎస్ 09 ఎఫ్‌జీ 6876)ను వదిలి వెళ్లడం కేసులో కీలక మలుపు. హెల్మెట్‌ను కూడా అక్కడే పారవేయడం ద్వారా ట్రేస్ కాకుండా ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

క్లూస్ టీం సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ ప్రకాష్‌లు బైక్‌ను అణువణువూ పరిశీలిస్తూ వేలిముద్రలు, సాంకేతిక ఆధారాలు సేకరించారు. నంబర్ ప్లేట్ ఫేక్‌గా తేలడంతో, ఇంజిన్--చాసిస్ నంబర్ల ఆధారంగా అసలు మూలాలు వెలికితీసే ప్రయత్నం జరుగుతోంది. ధర్మపురి లో లాడ్జిలో అద్దెకు దిగిన సందర్భంలో దుండగులు ఒడిస్సా రాష్ట్రంకు చెందిన నెంబర్ ప్లేట్ వాడినట్లు పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.
సీసీటీవీ ఫుటేజ్ లో దుండగులు వాడిన బైక్ కు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు మీడియాకు వెల్లడించలేదు

**సీసీటీవీల్లో క్లియర్ ఇమేజెస్... ఐదుగురు యాక్షన్‌లో, ఒకరు బ్యాక్‌ఎండ్?**



రెండు బైక్‌లపై ఐదుగురు వ్యక్తులు ధర్మపురిలోకి వచ్చిన దృశ్యాలు సీసీటీవీల్లో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. మొత్తం గ్యాంగ్ ఆరుగురిగా ఉండే, ఐదుగురు నేరంలో పాల్గొన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈనెల 1న సాయంత్రం 4 గంటల సమయంలో వీరి కదలికలు రికార్డ్ కాగా, ఉదయం 6 గంటల ప్రాంతంలో ఓ పెట్రోల్ బంక్ వద్ద ఇద్దరు బైక్‌కు పెట్రోల్ నింపించుకున్న దృశ్యాలు కూడా లభించాయి.

**గోదావరి దాటి ఎస్కేప్... అదిలాబాద్.. మహారాష్ట్ర లింక్ బలపడింది**



బైక్‌ను డంప్ చేసిన వెంటనే దుండగులు కాలినడకన గోదావరి నది దాటి అదిలాబాద్ వైపు వెళ్లి, అక్కడి నుంచి మహారాష్ట్రలోకి ఎంట్రీ ఇచ్చి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ధర్మపురి క్షేత్రానికి మహారాష్ట్ర నుంచి భారీగా భక్తులు రావడం ఈ గ్యాంగ్‌కు 'కవర్ ఆపరేషన్'గా మారినట్లు భావిస్తున్నారు.



**అడవుల్లో మరో బైక్... బీర్పూర్ దోనూర్ ట్రైల్**

మంచిర్యాల జిల్లా జన్నారం పరిధిలోని కలమడుగు అడవుల్లో మరో ద్విచక్ర వాహనం గుర్తించడం కేసుకు కొత్త కోణం జోడించింది. బీర్పూర్--దోనూర్ మధ్య మరో వాహనం కనిపించడం గ్యాంగ్ మల్టిపుల్ ఎస్కేప్ ప్లాన్‌ను సూచిస్తోంది.

**లాడ్జిలపై ఫోకస్... రికార్డులు సీజ్, క్షుణ్ణ విచారణ**

పట్టణంలోని పలు ప్రైవేట్ లాడ్జిల్లో రిజిస్టర్‌లు, ఐడీ ప్రూఫ్‌లు, సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పుడు పేర్లతో బస చేసిన కోణాన్ని కూడా లోతుగా పరిశీలిస్తున్నారు.

**పోలీసు జాగిలాలతో హంట్... గోదావరి తీరాల నుంచి అడవుల వరకు సెర్చ్**

కేసు తీవ్రత దృష్ట్యా పోలీసులు జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టి గోదావరి తీర ప్రాంతాలు, ఇటుక బట్టీలు, పరిసర గ్రామాలు, అడవి మార్గాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అలర్ట్ జారీ చేసి ప్రత్యేక బృందాలు నిందితుల కోసం వేటను మరింత ఉధృతం చేశాయి.

**క్లూస్ క్లియర్... అరెస్టులు ఎప్పుడైనా?**

లభ్యమవుతున్న సీసీటీవీ ఫుటేజీలు, ఫోరెన్సిక్ ఆధారాలు, వాహనాల ట్రైల్ అన్నీ కలిపి కేసు ఛేదన దిశగా పోలీసులు వేగంగా కదులుతున్నారు. దాదాపు 150 మంది వివిధ విభాగాల పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా ధర్మపురి లో బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహిస్తున్నారు. నిందితుల గుర్తింపు దాదాపు ఖరారైందని విశ్వసనీయ సమాచారం.
ఎప్పుడైనా అరెస్టులు జరిగే అవకాశముందని పోలీస్ వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి.



# ప్రతి పౌరుడు విజయ్ లా కదలాలి

ప్రతి పౌరుడు విజయ్ లా కదలాలి
కదలి అలలా కలకలం రేపిన క్షణం
కామరాజ్ నేల గుండెలో కొత్త నినాదం
వెండి తెరల వెలుగుల్లో నడిచిన వాడు
ప్రజల రక్తంలో రగిలిన స్వరం అయ్యాడు
విజయ్!
వెలుగుల వేదికలపై పలికిన మాటలు కాదు
వేదనల వీధుల్లో పుట్టిన వాక్యాలు!
చప్పట్లతో కాదు... చెమటతో గెలిచి ఈల
వేసెను
తమిళ నేలపై కొత్త చరిత్రకు చిహ్నం అతడు
నాయకుడు వస్తాడు అని ఎదురు చూసిన
జనానికి
నేనే మీలో ఒకడిని! అని నిలిచిన సింగం !
గొంతుక లేని వారి గుండెలో గర్జించిన
గీతమయ్యాడు
పాత రాజకీయాల పంజరాన్ని పగలగొట్టి,
కొత్త ఆశల పక్షిగా ఎగిరాడు...
అసహనం మంటలలో ఆవిరైపోయిన
యువత కోపానికి రూపం అయ్యాడు!
పేదవాడి కడుపులో ఆకలి అగ్గి,
విద్యార్థి కళ్లలో నిరాశ నీరు చూసి
మౌనం వహించని స్వరం శాసన సభ గంట
కొట్టింది
ఇది గంట శబ్దం కాదు... గర్జించిన ప్రజల
తీర్పు
ఓట్లు కాదు వేదనల విప్లవం!
గెలుపు కాదు ప్రజా సేవకు కొత్త మార్గం!
విజయ్ అంటే పేరు కాదు... నమ్మకం!
విజయ్ అంటే వ్యక్తి కాదు... ఉద్యమం!
ఓ తమిళ నేల... నీ పాదాలపై
కొత్త వెలుగుల వర్షం వచ్చింది
పాత చీకట్లను చెరిపేసే
యువ రక్తం జెండా ఎత్తింది
ఈ గెలుపు అక్కడితో ఆగిపోకూడదు
దేశమంతా దద్దరిల్లే మార్పుగా మారాలి
తమిళ నేల గుండె చప్పుళ్లు
గంగానది తీరాల వరకూ వినిపించాలి
మార్పు అనే అగ్ని దేశమంతా వ్యాపించాలి ఇదే
సమయం....
కులం, మతం, ప్రాంతం పేర్లతో
ముక్కలైన మనసుల్ని
మళ్ళీ ఒకే జెండా కింద చేర్చే
కొత్త స్వరం కావాలి!
పదవుల కోసం పాకులాడే నాయకత్వం వద్దు
హామీలతో మోసం చేసే రాజకీయం కాదు
హృదయాలతో నిలబడే నాయకులు కావాలి!
పల్లె పొలాల్లో రైతు కన్నీరు
పట్టణల్లో నిరుద్యోగి నిస్సహాయత వార్తలు
దేశ రక్తపు గాయాలు మార్చే విజయ్ లు
కావాలి
ఓ భారతమా...!
నీ గర్భంలో ఎన్నో కథలు పుట్టాయి...
ఇప్పుడు మరో కొత్త కథ ప్రారంభమైతే
కోట్లాది మంది ఆ కథలో పాత్రలకు సిద్ధంగా
ఉన్నారు!
తమిళ నేల చూపిన మార్గం
దేశానికి దిక్సూచి కావాలి...
ప్రజలలోనే ప్రజల కొరకు నాయకుడు రావాలి
విజయ్ నినాదం ప్రతి గుండెలో గర్జన కావాలి!
ఇది ఒక్కరి విజయం కాదు ప్రజల శక్తి!
ఇది ఒక రాష్ట్రం కథ కాదు దేశమంత
ఎదురుచూసే ఆశ!
మార్పు కోసం సమయం వచ్చింది!
ప్రతి పౌరుడు విజయ్ అవ్వాలి...
దేశ భవిష్యత్ మార్చడానికి ముందుకు సాగాలి




దుప్పటి మొగిలి
8466827118


# సినీ తార నుంచి సింహాసనం వరకు...

## విజయ్ రాజకీయ యాత్రలో కీలక ఘట్టం

**తమిళనాడు రాజకీయ చరిత్ర ఎప్పుడూ ఒక విలక్షణమైన ప్రవాహం. వెండితెర వెలుగుల నుంచి ప్రజాక్షేత్రం లోకి వచ్చి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన ఎం.జి. రామచంద్రన్, జయలలిత వంటి ఉద్దండుల వారసత్వం ఆ నేలపై బలంగా నాటుకు పోయింది. సరిగ్గా ఇదే బాటలో, 2026 అసెంబ్లీ ఎన్నికల వేళ 'దళపతి' విజయ్ తన 'తమిళగ వెట్రి కళగం' (టీ వీ కే) పార్టీతో సృష్టించిన ప్రభంజనం కేవలం ఒక నటుడి రాజకీయ ప్రవేశం మాత్రమే కాదు, అది దశాబ్దాల ద్రావిడ రాజకీయ గుత్తాధిపత్యానికి విసిరిన సవాలు. డీఎంకే, అన్నాడీఎంకే అనే రెండు ప్రధాన ధృవాల మధ్య నలిగిపోతున్న సామాన్యుడికి, ప్రత్యామ్నాయం కోరుకుంటున్న యువతకు విజయ్ ఒక ఆశాకిరణంగా కనిపించారు. అయితే, ఎన్నికల అనంతరం వెలువడిన ఫలితాలు విజయ్‌ను సింహాసనానికి చేరువగా తెచ్చినప్పటికీ, పూర్తి మెజారిటీకి అవసరమైన మేజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలోనే నిలిపివేసి, రాష్ట్ర రాజకీయాలను ఒక అనిశ్చిత, ఆసక్తికర మలుపు వద్ద నిలబెట్టాయి.**




తమిళనాడు అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాలకు గాను, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 118 స్థానాల మద్దతు అవసరం. ప్రస్తుత గణాంకాల ప్రకారం టీవీకే 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఒక కొత్త పార్టీకి, అందునా తొలి ఎన్నికల్లోనే సుమారు 35 శాతం ఓట్లను కొల్లగొట్టి 100 దాటడం అనేది భారత రాజకీయాల్లోనే అరుదైన విషయం. కానీ, ఈ 'విజయ్ విజయం' మెజారిటీ మార్కును దాటక పోవడమే ఇప్పుడు అసలైన రాజకీయ చదరంగ ప్రాధాన్యతను పెంచింది. సంప్రదాయ రాజకీయ శక్తులైన డీఎంకే తన పట్టును కోల్పోవడం, అన్నాడీఎంకే ఆశించిన స్థాయిలో పుంజుకోలేక పోవడం గమనిస్తే, ప్రజలు మార్పును కోరుకున్నారనేది స్పష్టమవుతోంది. ఈ మార్పు ఆకాంక్షే విజయ్‌ను కింగ్ మేకర్ స్థాయి నుంచి ఏకంగా కింగ్ అయ్యే దిశగా నడిపించింది. ఇప్పుడు ఆయన ముందున్న ఏకైక మార్గం 'మద్దతుల మేళవింపు'.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పాత్ర అత్యంత కీలకంగా మారింది. గత కొన్నేళ్లుగా డీఎంకేతో అంటకాగుతున్న కాంగ్రెస్, ఇప్పుడు తమిళనాడులో తన ఉనికిని చాటుకోవడానికి, అధికారంలో భాగస్వామి కావడానికి విజయ్ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

జాతీయ స్థాయిలో బీజేపీని నిరోధించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ, రాష్ట్ర స్థాయిలో ఒక బలమైన ప్రాంతీయ శక్తిగా ఎదుగుతున్న విజయ్‌తో చేతులు కలపడం వల్ల కాంగ్రెస్‌కు భవిష్యత్తులో లబ్ధి చేకూరుతుంది. ముఖ్యంగా మైనారిటీలు, క్రైస్తవ ఓటు బ్యాంకు విజయ్ వైపు మళ్ళడం కాంగ్రెస్‌ను పునరాలోచనలో పడేసింది. మరోవైపు, సిద్ధాంతపరంగా బద్ధశత్రువులైన డీఎంకే, విజయ్ మధ్య ఉన్న వైరం ఇప్పుడు రాజీ ధోరణిలోకి వస్తుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీని రాష్ట్రంలో అడుగుపెట్ట నివ్వకూడదనే ఉమ్మడి లక్ష్యంతో, డీఎంకే బయటి నుంచి మద్దతు ఇచ్చే సాహసం చేస్తుందా లేక ప్రతిపక్షంలో కూర్చుని వ్యూహాత్మక దాడులు చేస్తుందా అనేది వేచి చూడాలి.

అన్నాడీఎంకే విషయానికి వస్తే, జయలలిత మరణానంతరం ఆ పార్టీలో ఏర్పడిన శూన్యం, అంతర్గత విభేదాలు విజయ్‌కు వరంగా మారాయి. గణాంకాల పరంగా అన్నాడీఎంకే మద్దతు లభిస్తే విజయ్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. కానీ, రాజకీయాల్లో ఇద్దరు బలమైన నేతలు ఒకే ఒరలో ఇమడటం కష్టం. భవిష్యత్తులో ఓటు బ్యాంకు పంపకాలపై వచ్చే ఘర్షణలు ఈ కూటమికి అవరోధంగా మారవచ్చు. అయినప్పటికీ, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సూత్రం ప్రకారం, అధికారాన్ని పంచుకోవడానికి ఈ రెండు శక్తులు కలిసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. ఇవే కాకుండా, ఈ హంగ్ అసెంబ్లీలో చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు అకస్మాత్తుగా శక్తిమంతులుగా మారారు. ఒక్కో ఓటు ఒక ప్రభుత్వాన్ని కూల్చగలదు లేదా నిలబెట్టగలదు. ఇలాంటి తరుణంలో విజయ్ తన వ్యక్తిగత చరిష్మాతో ఈ చిన్నా చితకా శక్తులను ఎలా ఏకతాటిపైకి తెస్తారనేది ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనం.

విజయ్ ప్రస్థానంలో గమనించాల్సిన మరో ముఖ్య విషయం ఆయన సిద్ధాంత పరమైన పరిణతి. కేవలం సినీ గ్లామర్‌ను నమ్ముకోకుండా, ఆయన తన ప్రసంగాల్లో అంబేద్కర్, పెరియార్, కామరాజర్ వంటి మహనీయుల ఆశయాలను ప్రస్తావించడం ద్వారా ద్రావిడ సిద్ధాంతానికి సరికొత్త భాష్యం చెప్పారు. అవినీతి నిర్మూలన, సామాజిక న్యాయం, సెక్యులరిజం వంటి అంశాలను ఆయన తన ఎజెండాలో చేర్చడం ద్వారా విద్యావంతులను, యువతను ఆకర్షించారు. అయితే, ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వస్తే, ఇతర పార్టీలతో రాజీ పడాల్సి ఉంటుంది. ఎన్నికల ముందు 'ఒంటరి పోరు' అన్న మాట మార్చుకుని, కూటమి రాజకీయాలకు తెరలేపితే ప్రజల్లో ఉన్న 'నిఖార్సైన నాయకుడు' అనే ముద్రకు ఎంతో కొంత నష్టం కలిగే ప్రమాదం ఉంది. ప్రజాదరణను పరిపాలనగా మార్చడం కత్తి మీద సాము వంటిదే. ముఖ్యంగా పాలనా అనుభవం లేని టీమ్, ఇతర పార్టీల ఒత్తిళ్లు విజయ్‌ను ఇబ్బందులకు గురిచేయవచ్చు.




తమిళనాడు ఓటర్ల తీర్పును లోతుగా విశ్లేషిస్తే, అక్కడ ప్రజలు పాత పద్ధతులపై విసుగు చెందారు. వారసత్వ రాజకీయం కంటే సమర్థతకు పట్టం కట్టాలని భావిస్తున్నారు. విజయ్ సాధించిన ఓటు శాతం మరియు సీట్ల సంఖ్య ఆయనను ఒక సీరియస్ పొలిటికల్ ప్లేయర్‌గా నిలబెట్టాయి. 2026 నాటికి రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, డీఎంకే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను విజయ్ సమర్థంగా వాడుకున్నారు.

ఇప్పుడు ఆయన ముందున్న తక్షణ కర్తవ్యం మైనారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమా లేక కూటమి ప్రభుత్వాన్ని నడిపించడమా? మైనారిటీ ప్రభుత్వం అయితే ఎప్పుడూ అస్థిరత నీడలోనే ఉండాలి. అదే కూటమి అయితే అధికారాన్ని, నిర్ణయాలను పంచుకోవాలి. ఏది ఏమైనా, విజయ్ సినీ రంగం నుంచి సింహాసనం వైపు వేసిన అడుగులు ఇప్పుడు తుది అంకానికి చేరుకున్నాయి.

విజయ్ ప్రస్థానం తమిళనాడులో ఒక రాజకీయ పునరుజ్జీవనానికి నాంది పలికింది. డీఎంకే, అన్నాడీఎంకేల కంచుకోటలు బద్దలవుతున్న వేళ, ఒక కొత్త శక్తి ఉద్భవించడం ప్రజాస్వామ్యానికి శుభ పరిణామం. కానీ, సంఖ్యా బలం సరిగ్గా లేని స్థితిలో, ఆయన తీసుకునే నిర్ణయాలు తమిళనాడు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఇతర పార్టీల మద్దతు కూడగట్టడంలో ఆయన చూపే నేర్పు, కూటమిని నడపడంలో ఆయన చూపే సహనం ఆయనను ఒక పరిపూర్ణ రాజకీయ వేత్తగా మారుస్తాయి. తమిళనాడు ప్రజలు తమ ఆకాంక్షలను విజయ్ రూపంలో చూసుకుంటున్నారు. ఆ ఆకాంక్షలను నెరవేర్చి, సుస్థిరమైన పాలనను అందించడమే విజయ్ ముందున్న అసలైన సవాలు. 2026 ఎన్నికలు కేవలం విజేతను నిర్ణయించలేదు, ఒక కొత్త రకమైన రాజకీయ సంస్కృతికి పునాది వేసాయి. విజయ్ ఆ పీఠం ఎక్కుతారా లేదా అన్నదానికంటే, ఆయన సృష్టించిన ఈ రాజకీయ ప్రకంపనలు భవిష్యత్తు తరాలకు ఒక గొప్ప పాఠం. సంప్రదాయ ద్రావిడ రాజకీయాల నుంచి నవ ద్రావిడ రాజకీయాల వైపు తమిళనాడు చేస్తున్న ఈ ప్రయాణంలో విజయ్ ఒక కీలక మలుపు. ఆయన వేసే ప్రతి అడుగు ఇప్పుడు రాష్ట్రానికే కాదు, దేశ రాజకీయాలకే దిశానిర్దేశం చేయనుంది.


**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**